RNI-TELTEL/2017/72695

18 సెప్టెంబర్ 2023

# శుభ తెలంగాణ

సోమవారం | మేడ్చల్

ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :195

వెల:3 రూ/-

www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.




## మహారాష్ట్రలో లోయలోపడ్డ కారు నలుగురు తెలంగాణ వాసుల మృతి

### మృతుల్లో ఇద్దరు గ్రామీణ బ్యాంకు క్యాషియర్లు

### మరో నలుగురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన నలుగురు యువకులు దుర్మరణంపాలయ్యారు. మరో నలుగురు తీవ్రగాయాలపాలవ్వగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అమరావతి ఎస్పీ అవినాశ్ బర్గల్, మృతుల బంధుమిత్రుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామానికి చెందిన గొల్లి వైభవ్(24)తో కలిసి షేక్ సల్మాన్ చాంద్(30) శనివారం రాత్రి తన ఎస్‌యూవీ(ఏపీ28డీడబ్ల్యూ-2119)లో ఆదిలాబాద్‌కు వచ్చారు. అక్కడ తాంసి మండలం కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్యాషియర్ వివరాలు 2లో..

## చేతి వృత్తులకు చేయూత

### 'పీఎం విశ్వకర్మ' పథకం ప్రారంభం.. రూ.13 వేల కోట్లు కేటాయింపు

### ఐదేళ్లలో 30 లక్షల కుటుంబాలకు లబ్ధి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** దేశంలోని చేతివృత్తిదారులు సహా వివిధ హస్తకళాకారులకు చేయూతనందించేలా కేంద్రప్రభుత్వం 'పీఎం విశ్వకర్మ' పథకానికి శ్రీకారం చుట్టింది. వాస్తుశిల్పి విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఆదివారం ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 13 వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఈ నిధులను ఐదేళ్లపాటు చేతివృత్తిదారులు, కళాకారులకు ఖర్చు చేయనున్నారు. మొత్తంగా ఈ పథకం కింద 30 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని కేంద్రం పేర్కొంది. చేతివృత్తులు, హస్తకళాకారుల నైపుణ్యాన్ని మరింత మెరుగు పరిచి, నాణ్యమైన వివరాలు 2లో..

## చరిత్రను వక్రీకరించిన వారికి గుణపాఠమే!

### స్వాతంత్ర్య పోరాట చరిత్రను వక్రీకరించారు.. దాన్ని మోదీ సరిచేశారు

### నిజాం పాలనలో ఇక్కడి ప్రజలు నరకం చూశారు

### సర్దార్ పటేల్ లేకపోతే అంత త్వరగా విముక్తి కలిగేది కాదు

### విమోచన చరిత్ర దేశ ప్రజలకు తెలియాలి: కేంద్ర హోం మంత్రి షా

### వారివి ఓటుబ్యాంకు రాజకీయాలు.. బీఆర్ఎస్‌పై పరోక్ష విమర్శలు

### పరేడ్‌గ్రౌండ్ వేడుకలో జాతీయ జెండా ఆవిష్కరణ



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** స్వాతంత్ర్య పోరాట చరిత్రను ఆనాటి పాలకులు వక్రీకరించారని, దాన్ని ప్రధాని మోదీ సరిచేశారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. చరిత్రను వక్రీకరించిన వారికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తెలంగాణ విమోచన చరిత్రను కూడా కొంతమంది వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తోందని, అందుకే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని వివరాలు 2లో..

పాఠకులకు,
ప్రకటన కర్తలకు,
మిత్రులు,
శ్రేయోభిలాషులకు
వినాయకచవితి
శుభాకాంక్షలు.



## సెలవు

నేడు(సోమవారం) వినాయకచవితి సందర్భంగా శుభ తెలంగాణ కార్యాలయానికి సెలవు కావున పత్రిక పునర్దర్శనం బుధవారం.



## ప్రగతి నిరోధకులకు పరాజయమే

### బంగారు తెలంగాణ సాధనకు కృషి చేద్దాం

### దేశంలో ఎక్కడా లేనివిధంగా 'డబుల్' ఇళ్లు

### 67 వేల కోట్లతో సిగ్నల్ ఫ్రీగా హైదరాబాద్

### రాష్ట్రం ఆచరిస్తోంది.. దేశం అనుసరిస్తోంది

### సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం నిర్మించాం

### జాతీయ సమైక్యతా దినోత్సవంలో కేసీఆర్

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రగతి వైపు నడుస్తున్న తెలంగాణ కు కొందరు అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి శక్తులు పరాజయం పాలుకాక తప్పదని సీఎం కేసీఆర్ అన్నారు. తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచామని.. తెలంగాణ ఆచరిస్తున్న దానిని.. దేశమంతా అనుసరిస్తోందని పేర్కొన్నారు. సత్వర అభివృద్ధితో పాటు సంపద పెంచాలి.. ఆ సంపదను అవసరమైన వర్గాల ప్రజలకు పంచాలన్న ధ్యేయంతో తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.
బంగారు తెలంగాణ సాధనకు ఒక్కటిగా కృషి చేద్దామని వివరాలు 2లో..

**తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని చెప్పాం. మాట నిలబెట్టుకున్నాం. ఇప్పుడు తెలంగాణకు ఇచ్చే గ్యారంటీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే అమల్లోకి తెస్తాం. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్ కలిసికట్టుగా ఉన్నాయి. ఆ మూడు పార్టీలకు వ్యతిరేకంగా మేం పోరాటం చేస్తున్నాం. వంద రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం. - విజయభేరి సభలో రాహుల్**

వివరాలు 2లో..

# హామీల సునామీ..!

## తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ వాగ్దానాలు..

- ఆరు గ్యారెంటీలను ప్రకటించిన సోనియా
- మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి గృహిణికీ నెలకు
- రూ.2500.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- పేద మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్
- రైతులు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు,
- రైతుకూలీలు, భూమిలేని నిరుపేదలకు 12 వేలు
- వరికి మద్దతు ధర, క్వింటాకు రూ.500 బోనస్
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల సాయం
- తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం,
- గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద 10 లక్షల బీమా
- చేయూత పథకం ద్వారా 4 వేల వృద్ధాప్య పింఛన్
- యువ వికాస్ కింద విద్యార్థులకు 5 లక్షల సాయం
- తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాలి
- నా స్వప్నాన్ని మీరంతా నెరవేర్చాలి: సోనియా
- మోదీకి ఏ కష్టం వచ్చినా ఆదుకునేది కేసీఆరే
- అందుకే కేసీఆర్ అవినీతిపై ఎటువంటి కేసుల్లేవు
- కాంగ్రెస్ విజయభేరి సభలో రాహుల్‌గాంధీ

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** : తెలంగాణ లో వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కార్యాచరణ ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ.. అందుకోసం ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ప్రకటించింది. మహిళలు, రైతులు, కౌలురైతులు, నిరుపేదలు, వృద్ధులు, యువకులు.. ఇలా అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూర్చే పథకాలను చేపట్టనున్నట్లు తెలిపింది. ఆరు గ్యారెంటీల పేరిట వీటిని ప్రకటించి.. అధికారంలోకి రాగానే అమలుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఆదివారం తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఈ మేరకు ప్రకటనలు చేశారు. సభలో సోనియాగాంధీ





# హామీల సునామీ!

- మొదటి పేజి తరువాయి

మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాలని ఆకాంక్షించారు.

ఇదే తన స్వప్నమని, అందరూ కలిసి నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'మహాలక్ష్మి' పథకం కింద గృహిణులకు నెలకు రూ.2500 అందిస్తామని ప్రకటించారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రమంతటా మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తామన్నారు. దీంతోపాటు వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తామన్నారు. మహాలక్ష్మి సహా ఆరు గ్యారెంటీలను ప్రకటిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వీటిని కచ్చితంగా అమలు చేస్తామని అన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తాము.. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళతామని ప్రకటించారు. సమాజంలోని అన్ని వర్గాలకు మేలు జరగాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ(%=ఖుష్ట్రబశ్రీ +ఖుఅన్ష్ట్రఱ%( మాట్లాడుతూ.. వంద రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని, దీనిని ఏ శక్తీ అడ్డుకోలేదని అన్నారు. తెలంగాణలో బీజేపీ, మజ్లిస్, బీఆర్ఎసలు కలిసికట్టుగా ఉన్నాయని, అయినా అధికారంలో నుంచి దించి తీరుతామని ప్రకటించారు. "తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కేవలం బీఆర్ఎసతోనే పోరాడటం లేదు. బీఆర్ఎసతోపాటు బీజేపీ, మజ్లిసలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం, వాస్తవానికి ఈ పార్టీలన్నీ వేర్వేరు అని చెబుతుంటాయి. కానీ, ఈ మూడు పార్టీలూ ఒక్కటే.. భాగస్వామ్య పార్టీలే. బీఆర్ఎస్ నిజస్వరూపాన్ని పార్లమెంట్‌లో నా కళ్లతో చూశా. బీజేపీకి అవసరమైనప్పుడల్లా బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతుగా ఉంటుంది. 2014లో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకే మద్దతు ఇచ్చింది. జీఎస్టీ చట్టాన్ని తొలుత ఆమోదించింది ఆ పార్టీయే. రైతు చట్టాలకూ మద్దతుగా నిలిచింది" అని రాహుల్ అన్నారు.

**కాంగ్రెస్ సభను దెబ్బతీసేందుకు ప్రయత్నం**

కాంగ్రెస్ విజయభేరి సభ( ను ప్రకటించగానే దానిని దెబ్బతీయడానికి మూడు పార్టీలు సభలు పెట్టుకున్నాయని రాహుల్ ఆరోపించారు. అయినా కాంగ్రెస్ బలం ముందు వాళ్లు ఏం చేయలేకపోయారని, వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని అన్నారు. వారంతా ఈ రాత్రికే ఫోన్లు చేసుకొని.. కాంగ్రెసను ఎలా అడ్డుకోవాలని మాట్లాడుకుంటారని వ్యాఖ్యానించారు. దేశంలో తొమ్మిదేళ్లుగా నరేంద్రమోదీ ప్రభుత్వం అదానీకి మేలు చేయడానికి పనిచేస్తోందని, అన్ని పరిశ్రమల్లో అదానీకే మేలు జరిగి.. ప్రపంచంలోనే ఆయన అత్యంత ధనవంతుడు కాగలిగాడని తెలిపారు. అదానీ( గురించి పార్లమెంట్‌లో మాట్లాడినందుకే తన సభ్యత్వం రద్దు చేయించారన్నారు. దేశ సంపదను మోదీ అదానీకి పంచుతుంటే.. రాష్ట్ర సంపదనంతా కేసీఆర్ తన కుటుంబానికి దోచిపెడుతున్నారని ఆరోపించారు. అయినా కేసీఆర్ అవినీతిపై నరేంద్రమోదీ ఎలాంటి చర్యలు తీసుకోరని అన్నారు.మోదీ కి జాతీయస్థాయిలో ఏ కష్టమొచ్చినా కేసీఆర్( మద్దతుగా ఉంటారనే ఆయన అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేశంలో విపక్ష నేతలందరిపై ఏదో ఒక కేసు ఉందని, ఈడీ, సీబీఐ, ఐటీ అన్నిరకాల కేసులు విపక్ష నేతలపై పెట్టి దాడులు చేస్తున్నాయని, కానీ.. తెలంగాణ ముఖ్యమంత్రిపై, మజ్లిస్ నేతలపై మాత్రం ఒక్క కేసు కూడా లేకపోవడమే వారిద్దరి స్నేహానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ బీజేపీ రిస్తేదార్ సమితి (రక్తసంబంధీకుల పార్టీ) అనిఅవినీతిలో కేసీఆర్ అన్ని రికార్డులనూ చెరిపేశారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా తాము బీజేపీతో పోరాడుతుంటే.. మజ్లిస్ తమను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ప్రేమను, ఐక్యతను పంచుతుంటే.. బీజేపీ మాత్రం దేశంలో హింసను, ద్వేషాన్ని నింపుతోందని మండిపడ్డారు. సోనియాగాంధీ మాట ఇస్తే నిలబెట్టుకుంటారని, ఎంత నష్టం జరిగినా వెనక్కి వెళ్లరని రాహుల్‌గాంధీ అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని మాట ఇచ్చి.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారని తెలిపారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది కేసీఆర్‌కు మేలు చేయడానికి కాదని, పేద ప్రజలు, రైతులు, కూలీల మేలు కోసం ఇచ్చామని పేర్కొన్నారు. కానీ, తొమ్మిదేళ్లలో ఏ వర్గానికీ మేలు జరగలేదని అన్నారు.

**తొలిరోజే గ్యారెంటీలన్నీ అమల్లోకి..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు విషయంలో మాట నిలబెట్టుకున్నట్లే.. ఇప్పుడు ఇచ్చే గ్యారంటీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే అమల్లోకి తెస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారు. గ్యారెంటీల్లో భాగంగా.. "సొంతిళ్లు లేని వర్గాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం చేస్తాం. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన వారి కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తాం. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల దాకా ఉచితంగా కరెంట్ ఇస్తాం. యువ వికాస్ పథకం కింద విద్యార్థులకు కాలేజీల్లో చదువుకోవడంతో పాటు పోటీ పరీక్షల కోచింగ్‌కు రూ.5 లక్షల దాకా సాయం చేస్తాం. చేయూత పథకం కింద పింఛన్‌ను నెలకు రూ.4 వేలు ఇస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల దాకా బీమా సౌకర్యం అమలు చేసాం. రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు రూ.15 వేల సాయం అందిస్తాం. రైతుకూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తాం" అని రాహుల్ ప్రకటించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చే హామీలు అమలు చేయదని ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ అన్నారని, కానీ.. మంత్రివర్గం ప్రమాణ స్వీకారం రోజే అమల్లోకి తెచ్చామని తెలిపారు. తెలంగాణలో కూడా ఇచ్చిన హామీలన్నీ మంత్రివర్గం కొలువుదీరిన రోజు నుంచే అమల్లోకి తెస్తామన్నారు.

**కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ధరణి పోర్టల్ పేరుతో స్కామ్‌లు చేశారని, రైతుల, దళితుల భూములు లాక్కున్నారని మండిపడ్డారు. రైతుబంధుతో పెద్ద రైతులకే మేలు జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఎంత మందికి ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్‌లు లీక్ చేశారని, రాష్ట్రంలో 2 లక్షల దాకా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడంలేదని అన్నారు. ప్రజల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వ లాక్కున్న డబ్బునంతా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెనక్కి ఇస్తామన్నారు.

**కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు ఇవే..**

**1. మహాలక్ష్మి**

మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఆర్థిక సాయం
రూ.500కే వంటగ్యాస్ సిలిండర్
మహిళలకు రాష్ట్ర మంతటా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**2. రైతు భరోసా**

రైతులకు, కౌలు రైతులకు ఏటా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం. రైతుకూలీలకు, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల సాయం.
వరి పంటకు మద్దతు ధర కల్పించడంతోపాటు రూ 500 బోనస్ అందజేత

**3. గృహ జ్యోతి**

రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా

**4. ఇందిరమ్మ ఇళ్లు**

ఇల్లు లేని ప్రతి కుటుంబానికీ ఇంటిస్థలం. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
అదనంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటిస్థలం అందజేత.

**5. యువవికాసం**

విద్యార్థులకు విద్య భరోసా కార్డు అందజేత. రూ.5 లక్షల వ్యయ పరిమితితో, వడ్డీ రహిత ఆర్థిక సహాయక కార్డు అందజేసి కాలేజీ ఫీజులు, కోచింగ్ ఫీజులు, విదేశీ చదువుల ఫీజులు, విదేశీ ప్రయాణ ఖర్చులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు మరియు స్టడీ మెటీరియల్స్ కొనుగోలు, హాస్టల్ ఫీజులు, ల్యాప్‌టాప్, పరీక్ష ఫీజులు, పరిశోధన పరికరాలు, స్కిల్ డెవల్‌పమెంట్ కోర్సులు, ఇతర విద్యా సంబంధిత చెల్లింపులు చేసుకొనేలా సదుపాయ కల్పన.
ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు.

**6. చేయూత**

ప్రతి నెలా రూ.4 వేల చొప్పున వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ రోగులకు పింఛన్ల అందజేత.
పేదలకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా వర్తింపు

# ప్రగతి నిరోధకులకు పరాజయమే

- మొదటి పేజి తరువాయి

ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గన్‌పార్క్(%ఎఎఎవతీఖుఖుఃఎ +బఅజుఖుతీఎ%)లో తెలంగాణ అమర వీరులకు ఆదివారం కేసీఆర్ నివాళులర్పించారు. పబ్లిక్ గార్డెన్స్(%ఖాబఎశ్రీఱఎ ష్ణ్రుతీఎవఅం%)లో పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబరు 17న భారతదేశంలో అంతర్భాగమయిందని, ఈ సందర్భాన్ని 'తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు కేసీఆర్ చెప్పారు. ప్రజాస్వామ్య పాలనలోకి రావాలని యావత్ తెలంగాణ సమాజం సంఘర్షించిందని, ఆ పోరాట ఘట్టాలు, అమలరు త్యాగాలను మరచిపోలేమన్నారు. "తెలంగాణ సాధనతోనే నా జన్మ చరితార్థమైంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పునర్నిర్మాణ ప్రక్రియను నిబద్ధతతో నిర్వహిస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్లకు కూడా దేశాన్ని ఆర్థిక వెనుకబాటుతనం, పేదరికం, నిరుద్యోగం ఉండడం, సాంఘిక వివక్ష పట్టిపీడిస్తుండటం దురదృష్టకరం. తెలంగాణ పలు రంగాల్లో పురోగతి సా?ధిస్తోంది. దేశంలో ఉత్తమంగా వైద్య సేవలు అందిస్తున్నాం. నిరుపేదలకు కూడా సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో పెద్ద సంఖ్యలో ఆస్పత్రులను నిర్మిస్తున్నాం. ప్రతి జిల్లాలో మెడికల్, నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నాం. అంబులెన్స్‌ల సంఖ్య పెంచాం. కేసీఆర్ కిట్, కేసీఆర్ పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్నా" అని కేసీఆర్ వివరించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ట్రాఫిక్ రద్దీ నివారించి, సిగ్నల్ రహితంగా మార్చేందుకు రూ.67 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా అభివృద్ధి చేస్తూనే నగరానికి మరింత శోభను చేకూర్చేలా సచివాలయం, అమరవీరుల స్తూపం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహంనిర్మించామని చెప్పారు.

**పేదల అభ్యున్నతికి పథకాలు**

దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టామని కేసీఆర్ తెలిపారు. స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే పేదల కోసం 'గృహలక్ష్మి' పథకాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో ప్రధాన ఎత్తిపోతల పథకాల ద్వారా 75 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. పాలమూరులో ఉమ్మడి పాలకులు పెండింగ్‌లో పెట్టిన నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి 10 లక్షల ఎకరాలకు నీరిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో 36 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన సీతమ్మసాగర్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. 44 లక్షలమందికి ఆసరా పింఛను అందుతోందని చెప్పారు. "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేద కుటుంబాల అభ్యున్నతికి ఆర్థిక సహకార పథకాలను అమలు చేస్తున్నాం. మత్స్యకారులు, రజక, నాయీబ్రాహ్మణ, ఇతర కుల వృత్తులవారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నాం. ఆదివాసీ, గిరిజనుల ఆకాంక్ష అయిన పోడు భూములకు పట్టాల పంపిణీని చేపట్టాం. రాష్ట్రం ఐటీ రంగంలో పురోగమిస్తోంది. ద్వితీయ శ్రేణి నగరాలైన ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేటకు కూడా ఐటీని విస్తరించామన్నారు. ఐటీ ఉద్యోగుల సంఖ్య 3.23 లక్షల నుంచి 9.05 లక్షలకు చేరుకుంది. పల్లె, పట్టణ ప్రగతి ద్వారా అన్ని రకాల వసతులు కల్పించాం" అని కేసీఆర్ వివరించారు.

# చరిత్రను వక్రీకరించిన వారికి గుణపాఠమే!

- మొదటి పేజి తరువాయి

అధికారికంగా నిర్వహించడం లేదని పరోక్షంగా విమర్శించారు.. ఇలాంటి రాజకీయాలను దేశప్రజలు క్షమించబోరన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ విమోచన చరిత్ర దేశ ప్రజలకు తెలియాల్సి ఉందని,. 75 ఏళ్లుగా ఏ ప్రభుత్వం కూడా ఇంతటి చరిత్రాత్మక కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి మూడు కారణాలున్నాయని, అవి.. యువతకు, భవిష్యత్తు తరాలకు ఆనాటి మహోద్యమం గురించి తెలియజేయడం.. అమరులకు నివాళులర్పించడం, వారు కలలుగన్న రాష్ట్రాన్ని పునర్‌నిర్మించుకోవడం అని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా 399 రోజులపాటు తెలంగాణలో నిజాం ప్రైవేటు సైన్యమైన రజాకార్ల అరాచకం కొనసాగిందని పేర్కొన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం రాకుండా స్వతంత్ర్య రాజ్యంగా ఉంటే.. భరతమాత కడుపులో క్యాన్సర్ ఉన్నట్లేనని గుర్తించిన నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్.. తెలంగాణను రజాకార్లనుంచి విముక్తి చేయించారని, పటేల్ లేకపోతే.. తెలంగాణకు ఇంత త్వరగా విముక్తి లభించకపోయేదన్నారు. నిజాం పాలనలో క్రూరమైన చట్టాలు ఉండేవని, ఫలితంగా ఆ పాలనలో నాటి తెలంగాణ ప్రజలు నరకయాతన అనుభవించారని చెప్పారు. ఆయన పాలనలో క్రూర చట్టాలుండేవన్నారు.

ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పోలీసు చర్యకు పటేల్ ఆదేశించారని తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి కోసం ఉస్మానియాలో వందేమాతరం ఉద్యమం, ఆర్య సమాజ్, హిందూ మహాసభ వంటి సంస్థలెన్నో కలిసి ఉద్యమాలు చేశాయి. రావినారాయణరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, పీవీ నర్సింహారావు, కాళోజీ నారాయణరావు వంటి ఎంతోమంది ఆనాడు పోరాటం చేశారన్నారు. కాగా ప్రధాని మోదీ కృషివల్లే చంద్రయాన్-3 విజయవంతమైందని, జీ20ని జీ21గా మార్చిన ఘనత మోదీది అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇక సాయుధ బలగాల జవాన్‌ల కోసం ఇబ్రహీంపట్నంలో నిర్మించ తలపెట్టిన సశస్త్ర సీమాబల్ అధికారుల నివాస సముదాయాలను వర్చువల్ గా అమిత్ షా శంకుస్థాపన చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని.. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా.. బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను కూడా అమిత్ షా వర్చువల్ గా ప్రారంభించారు. తెలంగాణ స్వాతంత్రోద్యమ వెలుగు దివిటీలు షోయబుల్లాఖాన్, రాంజీ గోండుల స్మారక స్పెషల్ పోస్టల్ కవర్‌ను అమిత్ షా ఆవిష్కరించారు.

**త్యాగాల చరిత్రను తొక్కిపెట్టారు**

పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ చరిత్రను 75 ఏళ్లుగా దేశాన్ని పాలించిన పార్టీ, రాష్ట్రాన్ని పాలించిన అనేక పార్టీలు తొక్కిపెట్టాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో సెప్టెంబరు 17 సమైక్య దినం ఎలా అవుతుందని ప్రశ్నించారు. 'తెలంగాణ విమోచన దినోత్సవ సభ'లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 1947 ఆగస్టు 15 తర్వాత దేశమంతా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటుంటే.. తెలంగాణలో మాత్రం కాశీం రజ్వీ నేతృత్వంలో నిజాం సైన్యం, రజాకార్లు గ్రామాల మీద పడి అకృత్యాలు, దౌర్జన్యాలు, అత్యాచారాలు చేశారని పేర్కొన్నారు. అనేక రకాలుగా దోపిడీ చేసి, వేలాది మందిని హత్య చేశారని తెలిపారు. ఆ దాడులను ప్రతిఘటించేందుకు ప్రతీ గ్రామంలో బురుజులను నిర్మించుకున్నారని చెప్పారు. ప్రతీ మహిళా రోకలి బండ చేతబట్టి, కారంపొడి పొట్లాలతో రజాకార్లను ఎదుర్కొన్నారని అన్నారు. అటువంటి చరిత్రను 75 ఏళ్లుగా ప్రజలకు తెలియకుండా పార్టీలు మరుగునపడేశాయని మండిపడ్డారు. 75 సంవత్సరాలుగా విమోచన ఉత్సవాలు జరపకుండా మోసం చేశాయని కిషన్‌రెడ్డి అన్నారు.

# పూజలందుకోవడానికి సిద్ధమైన ఖైరతాబాద్ మహాగణపతి

**హైదరాబాద్** : నేడు (సెప్టెంబరు 18) వినాయకచవితి పర్వదినం. సోమవారం నుంచి దేశవ్యాప్తంగా నవరాత్రి శోభ వెల్లివిరియనుంది. ఎప్పట్లాగానే హైదరాబాదులోని ఖైరతాబాద్ మహా గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు అందుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇక్కడ గణేశ్ ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈసారి ఖైరతాబాద్ లో 63 అడుగుల గణేశుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారు శ్రీ దశ మహా విద్యా గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ విగ్రహాన్ని పూర్తిగా మట్టితో తయారుచేశారు. 150 మంది 3 నెలల పాటు శ్రమించి ఈ విగ్రహాన్ని రూపొందించారు.

# మహారాష్ట్రలో లోయలోపడ్డ కారు నలుగురు తెలంగాణ వాసుల మృతి

- మొదటి పేజి తరువాయి

శివకృష్ణ(31), భీంపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్యాషియర్ కోటేశ్వరరావు(31), బేల తెలంగాణ గ్రామీణ బ్యాంకు సిబ్బంది హరీశ్, యోగేశ్, జైనథ్ మండలం పెండల్‌వాడ తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్యాషియర్ సుమన్, అర్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగి శివశంకర్‌ను కారులో ఎక్కించుకున్నారు. ఆదివారం, వినాయకచవితి వరుస సెలవులు రావడంతో వీరంతా శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో ఉన్న చిక్కల్‌ధారకు విహారయాత్రకు బయలుదేరారు. ఉదయం 7.30కు వీరి వాహనం చిక్కల్‌ధార హిల్‌స్టేషన్ వద్దకు రాగానే.. అదుపుతప్పి 200 అడుగుల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. వర్షం, పొగమంచు కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రమాదంలో సల్మాన్, శివకృష్ణ, వైభవ్, కోటేశ్వర్‌రావు అక్కడికక్కడే చనిపోయారు. క్షతగాత్రులను తొలుత అచల్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో క్షతగాత్రులను అమరావతి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిక్కల్‌ధార పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

# చేతి వృత్తులకు చేయూత

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తులను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్టు కేంద్రం పేర్కొంది. 'పీఎం విశ్వకర్మ' పథకం కింద చేనేత, స్వర్ణకారులు, కమ్మరి, కుమ్మరి, లాండ్రీ, బార్బర్, శిల్పులు, తాపీమేస్త్రీలు, బొమ్మల తయారీదారులు, దర్జీలు(టైలర్) సహా 18 రకాల వృత్తుల వారికి స్వల్ప వడ్డీకే రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందించనున్నట్టు తెలిపింది. చేతి వృత్తులవారు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేలా రూ.లక్ష రుణాన్ని అందించనున్నారు. ఈ రుణాలకు సంబంధించి లబ్ధిదారులు 5% వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. కేంద్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల శాఖ మరో 8% వడ్డీని రాయితీగా చెల్లించనుంది. క్రెడిట్ గ్యారెంటీ ఫీజులను కేంద్ర ప్రభుత్వమే చెల్లించనుంది. అయితే, ప్రాథమికంగా రూ.లక్ష రుణం ఇస్తారు. తర్వాత అర్హతను బట్టి రూ.3 లక్షల వరకు ఇస్తారు. ఇక, ఈ పథకం కింద చేతివృత్తిదారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు 15 రోజుల పాటు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా కాలంలో రోజుకు రూ.500 చొప్పున స్టయిపెండ్ ఇస్తారు. చేతివృత్తులవారు తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకునేలా రూ.15 వేలను ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. ఈ పథకంలో చేరేందుకు కనీస వయసును 18 ఏళ్లుగా నిర్దేశించారు. పీఎం విశ్వకర్మ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ కావాలి.

**యశోభూమి కన్వెన్షన్‌సెంటర్ ప్రారంభం**

ప్రపంచస్థాయి సౌకర్యాలతో ఢిల్లీలో నిర్మించిన 'యశోభూమి' కన్వెన్షన్ సెంటర్ తొలిదశ నిర్మాణాన్ని ప్రధాని మోదీ ఆదివారం తన పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మన స్థానిక ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌ను ఎందుకు చేరుకోకూడదు? దీనికి ముందుగా మీరు(ప్రజలు) స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించండి. ఈ పండుగల సీజన్‌లో స్థానిక ఉత్పత్తులనే కొనుగోలు చేయండి. చిన్నదైనా పెద్దదైనా 'విశ్వకర్మ' అని ట్యాగ్ ఉన్న ఉత్పత్తులను కూడా కొనండి" అని అన్నారు.

**మోదీ బర్త్ డే.. శుభాకాంక్షల వెల్లువ**

ప్రధాని మోదీ 73వ వసంతంలోకి అడుగు పెట్టారు. ఆదివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు, అభిమానులు దేశవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. మోదీకి రాష్ట్రపతి, కేంద్రమంత్రులు, పలువురు సీఎంలు, రాజకీయ నేతలు, పలు రంగాల ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. "మోదీ దూరదృష్టి, బలమైన నాయకత్వంలో ప్రతిరంగంలో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను" అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. "మోదీ నవభారత రూపశిల్పి. అలాంటి విశిష్ట నాయకుడి నేతృత్వంలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా" అని కేంద్రహోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

# తెలంగాణ సమాజంలో చిచ్చు పెడితే సహించం: జగదీశ్ రెడ్డి

**అమిత్ షా సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి మండిపాటు**

**కాంగ్రెస్ చరిత్ర అందరికీ తెలుసని ఎద్దేవా**

**గాంధీలు చెప్పే మాటలు వినే స్థితిలో ప్రజలు లేరని వ్యాఖ్య**



తెలంగాణ విమోచన దినం పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అపోహలను సృష్టిస్తున్నారని తెలంగాణ మంత్రి జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. చరిత్రలోని పాత గాయాలను మళ్లీ రగిలించి, సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి వారు దేశ మనుగడకు ప్రమాదకరమని అన్నారు. అన్నదమ్ముల్లా కలిసున్న తెలంగాణ సమాజంలో చిచ్చుపెడితే సహించబోమని హెచ్చరించారు.

కర్ణాటకలో ఒక్క హామీని కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ చరిత్ర ఏమిటో ప్రజలందరికీ తెలుసని చెప్పారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఎన్ని చెప్పినా ప్రజలు వినే పరిస్థితిలో లేరని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తామని ఆ పార్టీ పగటి కలలు కంటోందని ఎద్దేవా చేశారు.

## ప్రతి ఇల్లు తిరుగుతూ బొట్టు పెడుతూ, ఓటర్ నమోదు చేయాలి

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు



**శుభ తెలంగాణ :**సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పౌరుని పేరు ఓటరు జాబితాలో ఉండేలా తగ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు.ఆదివారం సాయంత్రం డిఆర్డిఓ సిబ్బందితో వెబ్ఎక్స్ ద్వారా కాన్ఫరెన్స్ నిర్వహించారు.1 స్లీప్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో "ప్రతి ఇల్లు తిరుగుతూ బొట్టు పెట్టు, ఓటరు నమోదు చేసి పెట్టు" కార్యక్రమం నిర్వహించాలని, ఈనెల 19వ తేదీ వరకే ఓటర్ నమోదు చివరి అవకాశం కావున, అక్టోబర్ 1 ,2023 నాటికి 18 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రతి ఇల్లు తిరిగి చెప్పాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే డి ఆర్ డి ఓ ద్వారా చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. భవిష్యత్తు ప్రణాళికను వివరించారు. ఈ కాన్ఫరెన్స్లో డి ఆర్ డి ఓ పి డి కిరణ్ కుమార్ ఏపీడీలు సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల ను పూజిద్దాం.. పర్యావరణం ను పరిరక్షిద్దాం ..ప్రభుత్వ విప్ గాంధీ.



**శుభ తెలంగాణ :**మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ గాంధీ ఆద్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం వినాయకచవితి పర్వదినం ను పురస్కరించుకుని మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యలయం లో ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ కార్యక్రమం లో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, శ్రీమతి పూజిత జగదీశ్వర్ గౌడ్, మంజుల రఘునాథ్ రెడ్డి , రోజాదేవి రంగరావు, మాజీ కార్పొరేటర్ సాయి బాబా తో కలిసి ప్రజలకు,కాలనీ వాసులకు పంపిణీ చేసిన ప్రభుత్వవిప్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాద్యత తీసుకోవాలని ,మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం అని, పర్యావారణ విషయంలో తమదైన పాత్ర పోషించడం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత తో మెలగాలని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు,ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులు,ఉద్యమకారులు, పాత్రికేయ మిత్రులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు,శ్రేయభిలాషులు,మహిళలు ,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆరెక పూడి గాంధీ.



**శుభ తెలంగాణ :**చందానగర్ డివిజన్ పరిధిలోని కె ఎస్ ఆర్ ఎనక్లేవ్ కాలనీ లో సర్వీ సమాజ్ ట్రస్ట్ శేరిలింగంపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆరెక పూడి ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్, ఓ. వెంకటేష్, ప్రసాద్ ,రవీందర్ రెడ్డి, నరేందర్ బల్లా, అప్సర్ మరియు సర్వీ సమాజ్ ట్రస్ట్ సభ్యులు అధ్యక్షులు మనోజ్ చౌదరి, వైస్ ప్రెసిడెంట్లు మంగిలాల్ పరిహరియా చౌదరి, కంగర్ సొయాల్ చౌదరి ,సెక్రటరీ హనుమన్ సోయల్ చౌదరి ,సెక్రటరీ మంగిలాల్ సొన్పర చౌదరి ,ట్రెజరర్ వినోద్ గెహ్లాట్ చౌదరి ,వినోద్ చౌదరి, వినయ్ చౌదరి, కెహ్వారామ్ చౌదరి మరియు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవ చేసే లయన్స్ క్లబ్ లో సభ్యునిగా చేరడం గొప్ప అదృష్టం. అవకాశం.

- పాలకుర్తి లయన్స్ క్లబ్ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.
- ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి లయన్స్ క్లబ్ లో సభ్యునిగా చేరారు.







**తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ సమాజ సేవ చేసే లయన్స్ క్లబ్ లో సభ్యునిగా చేరడం గొప్ప అదృష్టం. అవకాశం. లయన్స్ క్లబ్ స్ఫూర్తి తోనే నేను ఎర్రబెల్లి ట్రస్టు ఏర్పాటు చేస, సేవలు చేస్తూ, ప్రజాభిమానం చూరగొంటున్న. లయన్స్ క్లబ్ ద్వారా సేవ చేసే వారి జీవితాలు ధన్యం. సమాజ సేవ చేసే వారి కుటుంబాల పిల్లల కు భవిష్యత్తు తరాలకు భగవంతుని ఆశీస్సులు లభిస్తాయి.

సేవల నిలయంగా వెలుగొందుతున్న పాలకుర్తి... మహనీయులకు జన్మనిచ్చిన గడ్డ.

రామాయణ కావ్య సృష్టికర్త వాల్మీకి, ఆదికవి, తొలి తెలుగు విప్లవ కవి పాల్కురికి సోమనాథుడు, సహజకవి బమ్మెర పోతన జన్మించిన పాలకుర్తి నియోజకవర్గం ధార్మిక కేంద్రంగా వెలుగొందే విధంగా ప్రభుత్వం ద్వారా కోట్ల రూపాయలు వెచ్చించి చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతున్నాను.

320ఎఫ్ జిల్లా కేంద్రం వరంగల్ లో లయన్స్ సేవా భవనం నిర్మాణం కోసం కావలసిన అనువైన భూమి ప్రభుత్వం నుండి ఇప్పించడానికి పూర్తి సహకారం అందిస్తాను.

ఈ సదస్సుకు జిల్లా గవర్నర్ ఎన్. వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించగా, స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు మల్టిపుల్ చైర్మన్ తీగల మోహన్ రావు. గ్లోబల్ యాక్షన్ టీం నాయకులు ఆవుల గోపాల రావు, గోలి అమరేందర్ రెడ్డి, మనోజ్ కుమార్ పురోహిత్, జి. చెన్నకిషన్ రెడ్డి, జిల్లా పూర్వ గవర్నర్లు కన్న పరశురాములు, ముచ్చా రాజిరెడ్డి, టి. లక్ష్మీ నరసింహారావు, కే.సి. జాన్ బన్నీ, డా. రాజేందర్ రెడ్డి, పోకల చందర్, కే. అంజయ్య, వైస్ జిల్లా గవర్నర్లు కుందూరు వెంకట్ రెడ్డి, డా. చంద్రశేఖర ఆర్యా, కార్యక్రమ కో ఆర్డనేటర్ లు వి. ప్రసాద రావు, డా. అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బద్రత సిబ్బంది కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి



**శుభ తెలంగాణ :**మంత్రి సత్యవతి రాథోడ్ గారి భద్రత సిబ్బంది యాకయ్య తండ్రి ఇటీవలె మృతి చెందారు. నేడు రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ గారు మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండల కేంద్రంలోని వారి నివాసానికి చేరుకుని కి,శే మంగళపెల్లి వెంకటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ రామచంద్రయ్య, పార్టీ అధ్యక్షుడు వెంకన్న, యకన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే.

### సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్.







**శుభ తెలంగాణ :**వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం పార్టీ తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్థూపాలను మండలంలోని కంటాయపాలెం గుర్తురు,, అమ్మాపురం ,తొర్రూరు హరిపిరాల గ్రామాలలో అమరవీరుల స్తూపాల వరకు బైక్ ర్యాలీ సిపిఎం పార్టీ తోరూర్ మండల కార్యదర్శి ఎం డి యాకూబ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై న అశోక్ మాట్లాడుతూ 1946 లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో కమ్యూనిస్టు నాయకత్వాన రజాకార్లకు దేశ్ముకులకు ఫ్యూడల్ భూస్వామ్య శక్తులకు వ్యతిరేక మైన పోరాటం. దున్నేవానికి భూమి కావాలని జరిగిన మహత్తర పోరాటం 1951 వరకు సాగింది. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో జరిగిన ఈ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టులది అని అన్నారు. తెలంగాణలో వేటికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో 4500 మంది ప్రాణాలను కోల్పోయారు. అంతిమంగా భారతదేశంలో భూ సమస్యను ఎజెండా మీదికి తెచ్చిన చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. ఈ చరిత్రను వక్రీకరిస్తూ బిజెపి ఆర్ఎస్ఎస్ భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటం కాదు హిందూ ముస్లిం పోరాటం అనడం సిగ్గుచేటు అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేసి, ధరల స్థిరీకరణ చట్టాలు ఉల్లంఘించి, బిజెపి ప్రజలు వాడుకునే నిత్యవసర వస్తువుల ధరలను ఆహార ధాన్యాలను కృత్రిమ కొరత సృష్టించి పేదలపై భారాలు మోపిందని విమర్శించారు. రష్యా భారతదేశానికి కారు చౌకగా ఇస్తున్న వంటగ్యాస్ ను మన దేశ ప్రజలకు ఇవ్వకుండా బడా కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలకు దారాదత్తం చేసిన ఘనత బిజెపి మోడీది అన్నారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర తెలిసిన ప్రజలే బిజెపికి గుణపాఠం చెప్తారని అన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి ఎం డి యాకుబ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో బి ఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం భారతదేశం సమైక్యతతో ఉండాలి అంటున్నాడు. మతాల మధ్య చిచ్చుపెట్టే బిజెపి ఎజెండానే కెసిఆర్ అమలు చేస్తున్నాడని విమర్శించారు. దళితులకు ఇవ్వవలసిన దళిత బంధు టిఆర్ఎస్ బంద్ గా మారిందని ఆయన విమర్శించారు. తెలంగాణ అంటేనే కమ్యూనిస్టులు కమ్యూనిస్టులు అంటేనే తెలంగాణని ఎప్పుడైనా తెలంగాణ కమ్యూనిస్టుల అడ్డేనని అని కమ్యూనిస్టుల పోరాటాలను ప్రజలంతా తొందరగా మర్చిపోరని వారు అన్నారు. ప్రజలందరూ కమ్యూనిస్టులను ఆదరించి అధికారంలోకి తీసుకువచ్చే దాంట్లో ముందు వరసలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సోమిరెడ్డి, బోర స్వామి, మార్క సాంబయ్య, గుద్దేటి సాయి మల్లు, జమ్ముల శ్రీను, డోనక దర్గయ్య, కంటాయపాలెం ఉపసర్పంచ్ గజ్జి రామ్మూర్తి, ఉమా గాని యాకయ్య, తిమ్మిడి రవి, తాళ్ల వెంకటేశ్వర్లు ,శంకర్, జితేందర్ రెడ్డి, రామ్ రెడ్డి ,కాయల ఎల్లయ్య, కుమార్, సోమన్న , ధరావత్ యాకన్న, సుమన్ ,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17, బి.ఎస్. పి తెలంగాణ పునర్విముక్తి ప్రతిజ్ఞ దివస్ నిర్వహణ

ఈదునూరి ప్రసాద్ పాలకుర్తి నియోజవర్గ ప్రధాన కార్యదర్శి



**శుభ తెలంగాణ :**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కేంద్రంలో ఆదివారము రోజున బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ పునర్విముక్తి ప్రతిజ్ఞ దివస్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఈదునురి ప్రసాద్ గారు మాట్లాడుతూ 1947 ఆగస్టు 15 న భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ సంస్థానంగా నిజాం పరిపాలనలో కొనసాగుతుంది. ఇతని పరిపాలనలో పేద వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పై హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దోపిడీ విచ్చలవిడిగా జరిగాయి. ఆ దోపిడీ పాలనను నిర్మూలించడానికి ఎందరో ప్రాణాలకు ఎదురొడ్డి పోరాటం చేశారు. తత్ఫలితంగా 1948 సెప్టెంబర్ 17 న నిజాం యొక్క నిరంకుశత్వ పాలన నుండి హైదరాబాద్ సంస్థానం భారతదేశము లో అంతర్భాగమైందని ఆయన తెలిపారు.

అదేవిదంగా నేడు బి ఆర్ ఎస్ పరిపాలనలో తెలంగాణ ప్రజలు హత్యలు, ఆత్మహత్యలు, దోపిడి,దౌర్జన్యాలకు బలి అవుతున్నారు అని అన్నారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి తెలంగాణ ప్రజలు విముక్తి కోరుకుంటున్నారు, తెలంగాణలో బహుజన రాజ్యాధికారం వచ్చినప్పుడు తెలంగాణ బానిసత్వ, పునర్ విముక్తి నిరుపేద వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తొర్రూరు మండల కార్యదర్శి గుడెల్లి ప్రదీప్,అమ్మపూరం గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్ మరియు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ఓవరాల్ ఛాంపియన్ షిప్ గా నిలిచిన ఈ.యం. ఆర్.యస్. ములకలపల్లి విద్యార్థులు



**శుభ తెలంగాణ :**దమ్మపేట మండలం అంకంపలెంలో నడుస్తున్న ఈ.యం.ఆర్.యస్. ములకలపల్లి విద్యార్థులు ఈ నెల 14 మరియు 15 వ తారీఖున ఈ.యం.ఆర్.యస్. సిర్పూర్ మరియు ఖగజ్ నగర్ లో జరిగిన రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్టివల్ లో పాల్గొని వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్ షిప్ గానిలిచిన సందర్భంగా ప్రాంతీయ సమన్వయ అధికారి డేవిడ్ రాజ్, జెడ్.పి.టి.సి. పైడి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ కుంజ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, మ్యూజిక్ %a% ఆర్ట్ టీచర్స్ చైతన్య మరియు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

శుభ తెలంగాణ
TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
సోమవారం | మేడ్చల్
18 సెప్టెంబర్ 2023
www.subhatelangana.in



# మట్టి వినాయకులను పూజించండి పర్యావరణాన్ని పరిరక్షించండి

● కొమ్మనపల్లి ప్రధానోపాధ్యాయులు రాయి పెల్లి యాకయ్య



**శుభ తెలంగాణ :**మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొమ్మనపల్లి ప్రధానోపాధ్యాయులు రాయిపెల్లి యాకయ్య అన్నారు వినాయక చవితి సందర్భంగా ముందస్తుగా పాఠశాలలో విద్యార్థుల చేత బంకమట్టి తెప్పించి వారి చేత స్వయంగా వినాయకుని విగ్రహాలను తయారు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ ఎంపీటీసీ గణేష్ గారు మాట్లాడుతూ స్వయంగా పిల్లల చేత విగ్రహాలు తయారు చేయించడం వల్ల వారి లోపల ఉన్న సృజనాత్మకతను బయటికి తీయడంతో పాటుగా కళా నైపుణ్యాలను పెంపొందించినట్లుగా విద్యార్థుల మధ్య సహకార సోదర భావాన్ని అభివృద్ధి చేసే విధంగా ఉంటుందని అన్నారు ఇలా చేస్తున్న ప్రధానోపాధ్యాయులను అభినందించారు ప్రధానోపాధ్యాయులు యాకయ్య గారు మాట్లాడుతూ ఈ సందర్భంగా బ్రిటిష్ వారి పాలన నుండి భారతదేశానికి విముక్తి కలిగించడానికి బాలగంగాధర్ తిలక్ గణపతి ఉత్సవాలను మన దేశంలో సమైక్యతను పెంపొందించడానికి ప్రవేశపెట్టి ప్రజల మధ్య జాతీయ సమైక్యతను పెంపొందించి స్వాతంత్రం సాధించడంలో విశేషమైన కృషి చేసినారని అదే స్ఫూర్తిని రాబోయే తరాలకు నేటి యువత అందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మోహన్ విద్యార్థులు పాల్గొన్నారు

## విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలు జరిపిన తొర్రూరు విశ్వకర్మలు






**శుభ తెలంగాణ :**
శ్రీ మద్విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం సందర్భంగా ఈరోజు ఆ యొక్క విశ్వకర్మ భగవానుడు కన్యా సంక్రమణంలో విశ్వాన్ని సృష్టించిన పర్వదినం కావున స్థానిక శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వాటి మీద తొర్రూర్ లో శ్రీ మాత గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి అభిషేక పూజా కార్యక్రమాలు తదుపరి అధ్యక్షులు కల్లూరు నాగేంద్ర చారి విశ్వకర్మ పతాకావిష్కరణ చేయడం జరిగింది తదుపరి జ్యోతి ప్రజ్వలన గణధిపతి పూజ పుణ్యహ వచనము రుత్విక్ వరణ ము దీక్ష ధారణ బ్రహ్మకలశస్థాపన శ్రీ గాయత్రీ విశ్వకర్మ పంచ బ్రహ్మ నవగ్రహ వాస్తు మంటపారాధనలు మహన్యాస క్రియా కళాపములు సద్యోజాతాది మనుమయ త్వష్ట శిల్పి విశ్వజ్ఞ బ్రహ్మ లకు సప్తదిగ్ నమస్కృతులు ఉపచారాలు అగ్ని ప్రతిష్ట మండప అధిష్ఠాన దేవత హవనము శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞము ఇత్యాది పూజా కార్యక్రమాలతో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మూల మంత్ర హవనము పంచ బ్రహ్మ ఉపనిషత్ మొదలగు హెూమాది పూజా కార్యక్రమాలు దేవాలయ ఆస్థాన పండితులువేదాగమ వాస్తు జ్యోతిష్య పురోహితులు బ్రహ్మశ్రీ ఇటికేల విశ్వప్రకాశాచార్యులు గారు మరియు వారి శిష్య బృందము ఆలయ అర్చకులు రామగిరి విక్రమ్ శర్మ గారు రాగి భాస్కరాచార్యులు గారు నిర్వహించి ఉన్నారు తదుపరి పూర్ణాహుతి మహా నివేదన తీర్థ ప్రసాద వితరణ మహా అన్నదాన కార్యక్రమాలు మహావైభోవోపేతంగా నిర్వహించినారు ఈ యొక్క కార్యక్రమానికి తొర్రూర్ కార్పెంటర్ అసోసియేషన్ మరియు దాతల సహకారంతో భక్తులందరికీ కూడా భోజన సదుపాయ ఏర్పాట్లతో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నారుఈ విశ్వకర్మ మహెూత్సవ పూజా కార్యక్రమంలో ఆలయ నిర్వహణ శాశ్వత నిధి కమిటీ అధ్యక్షులు కల్లూరి నాగేంద్ర చారి కళావతి దంపతులు ప్రధాన కార్యదర్శి తంగళ్ళపల్లి పూర్ణాచారి గారు కోశాధికారి అలుగోజు చంద్రశేఖర ఆచారి బోగోజు సదానంద చారి పబ్బోజు వెంకటాచారి అబ్బనపురి పూర్ణాచారి రాగి శ్రీనివాసాచారి గజ్జేల వెంకటేశ్వర్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అల్లోజు ఉపలాచారి కల్లూరి శంకరాచారి తొర్రూరు పట్టణ అధ్యక్షులు కల్లూరి కుశాల్ చేన్నోజు విజయకుమార్ కాసోజు శ్రీనివాస్ సల్వోజు దేవేంద్ర చారి దేవరకొండ శ్రీనివాస్ బోగోజు సురేష్,దుర్సోజు వీరాంజనేయులు, కల్లూరి యాదగిరి, దేవరకొండ కృష్ణ ప్రసాద్, సిరికొండ విక్రమ్ మరియు వివిధ గ్రామాల విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది పాల్గొన్నారు

## 12వ రోజు దీక్షలు ప్రారంభించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్

వైస్ ఛాన్సులర్ రిజిస్టర్ వెంటనే విద్యార్థులకు న్యాయం చేయాలి



**శుభ తెలంగాణ :**వరంగల్ కాకతీయ యూనివర్సిటీ లో ఈ రోజు 12 వ దీక్ష చేస్తున్న సందర్భంగా దీక్ష చేస్తున్న విద్యార్థులకు విద్యార్థి సంఘ నేతలకు పూల మాలలు వేసి ప్రారంభించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ అఫ్ ఇండియా అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్, ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ లో ఏప్పుడు జరగని విధంగా ఈసారి పీహెచ్డీ ఎంట్రెన్స్ ఇంటర్వ్యూ లో అవకతవకలు ఇప్పుడు బాగా జరిగాయని అన్నారు, తమకు అనుకూలమైన వారికి మాత్రమే సీట్లు ఇచ్చారని దానికి సహకరించిన డీను ఫ్యాకల్టీ సోషల్ సైన్స్ రిజిస్ట్రార్ విసి అందరూ బాధ్యత వహించాలని అన్నారు, ఇప్పటికైనా కమిటీ వేసి పిహెచ్డి కేటగిరి 2. లో సెకండ్ లిస్టు పెట్టాలని అన్నారు, లేని పక్షాన దశలవారీగా శాంతియుతంగా ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థి సంఘం నేతలు,తదితరులు పాల్గొన్నారు, కేయూ జాక్ చైర్మన్ పాషా భాస్కర్ మంద కుమారస్వామి రాజేష్ తదితరులు పాల్గొన్నారు,

## పలు గ్రామాలలో తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు....

పాల్గొన్న భారతీయ జనతా పార్టీ నాయకులు కొత్త రామచంద్రు.



**శుభ తెలంగాణ :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెంకటాపురం, వేములకొండ గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గ్రామంలో జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళు లు,అర్పించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కొత్త రామచంద్రు మాట్లాడుతూ విమోచనం కోసం గొంతెత్తిన పార్టీ బిజెపియేనని నిజాంకు వ్యతిరేక పోరాట చరిత్రను కాంగ్రెస్ సమాధి చేసిందని భూమికోసం భుక్తి కోసం ఎందరో నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు కాంగ్రెస్ గుర్తించలేదని విమర్శించారు. అదేవిధంగా టీఆర్ఎస్ చేస్తున్న అవినీతి పాలన పట్ల రాష్ట్ర ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని రాబోయే రోజుల్లో బిజెపి జెండా ఎగరబోతుందని ఆయన అన్నారుఈ కార్యక్రమంలో వెంకటాపురం వేములకొండ గ్రామలలోని బిజెపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త రహిత పట్టణం మనందరి బాధ్యత

● మున్సిపల్ చైర్మన్ మంగలపల్లి రామచంద్రయ్య......
● మున్సిపల్ కమిషనర్ పి సరస్వతి...,



**శుభ తెలంగాణ :**ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 లో భాగంగా నేడు ఫిఫ్త్ వార్డ్ అంగడి యందు సిక్స్త్ వార్డ్ ముత్యాలమ్మ టెంపుల్ ఆవరణలో ఉన్న చెత్తను తొలగించడం జరిగిందన్నారు.
వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డి తో కలిసి చెత్త సేకరణ అంగడి యందు ముత్యాలమ్మ టెంపుల్ ఆవరణలో చిత్త సేకరణ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
??? పరిశుభ్రమైన మరియు చెత్తరహిత పట్టణం కొరకై ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 లో నుండి ఇట్టి కార్యక్రమం లో యువత నేడు స్వచ్ఛందంగా పాల్గొని చెత్తను తొలగించటం జరిగిందన్నారు. స్వచ్ఛత లీగ్ బ్రాండ్ అంబాసిడర్ గా మున్సిపల్ చైర్మన్ మంగలపల్లి రామచంద్రయ్య నిర్ణయించడం అయిందన్నారు. కౌన్సిల్ %ఽ% కో ఆప్షన్ సభ్యులు ప్రతి వార్డు తిరుగుతూ చెత్తను తొలగించే గొప్ప కార్యక్రమం నిర్వహించటం జరిగిందని దాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా వార్డులలో సైతం నడుస్తూ చెత్త తొలగింపు కార్యక్రమం నిర్వహించారన్నారు. ఇలాగే మీ నివాస ప్రాంతాలలో సైతం చెత్త రహితంగా ఉండటానికి బయట చెత్తను తొలగించాలన్నారు. అంగడి యందు చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించనున్నారు ముత్యాలమ్మ టెంపుల్ దగ్గర మానవహారం నిర్వహించామన్నారు ప్రతి ఒక్కరు తడి చెత్త పొడి చెత్త వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ ఈ రంజిత్ . మేనేజర్ కట్ట స్వామి. మున్సిపల్ ఫ్లోర్ లీడర్. ఎన్నమనేని శ్రీనివాసరావు. కౌన్సిలర్లు భూసాని రాము. రోజా. సంగీత రవి. పేర్ల యమునా జంప. సునీత జై సింగ్. గజానంద్. చెకిలేలా అలివేలు. దొంగరి రేవతి శంకర్. కర్నే నాగజ్యోతి నాగరాజు. గూగులోత్ శంకర్. బిజ్జాల మాధవి అనిల్. కొలుపుల శంకర్. వార్డ్ ఆఫీసర్లు బిల్ కలెక్టర్లు %ాం% తదితరులు పాల్గొన్నారు

## నేత్రదానానికి ముందుకు రావాలి

● వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి



**శుభ తెలంగాణ :** నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వైస్ ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఫతేపురం గ్రామంలో భవిరిశెట్టి లక్ష్మీ సోమయ్య కూతురు శైలజ ఇటీవల మృతి చెందగా, ఆమె నేత్రాలను దానంచేసి మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించారు. నేత్రదాత శైలజ సంస్మరణ సభను గ్రామంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ....
సర్వేంద్రియానాం నయనం ప్రధానమని, అంధత్వంతో బాధపడుతున్న చిన్నారులకు దాతలు అందించే నేత్రాలు వారి జీవితాల్లో వెలుగును నింపుతాయన్నారు.
నిత్యం అందమైన ప్రకృతిని, బాహ్య ప్రపంచాన్ని ఆస్వాదించే మనం... ఒక్క నిమిషం కళ్ళు మూసుకుంటే అంతా అంధకారమేనన్నారు. అదే నిత్యం అంధత్వంతో బాధపడే వారికి జీవితమంతా చీకటిగానే ఉంటుందని, అలాంటి వారిలోని అంధత్వాన్ని తొలగించేందుకు ఏకైక మార్గం నేత్రదానమేనని స్పష్టం చేశారు. మరణం అనంతరం నేత్రదానం చేయాలనుకుంటే లయన్స్ క్లబ్ ను సంప్రదించాలని, 9492781306 కు ఫోన్ చేసి నేత్రదానం చేయవచ్చు అన్నారు. శైలజ కుటుంబానికి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత కుమార్తె గాయత్రి, ఆమె భర్త రాజులకు అభినందన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు సోమేశ్వర్ అల్లా బాబు కుల బంధువులు మిత్రులు లైన్స్ క్లబ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం..



**శుభ తెలంగాణ :**తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈరోజు తొర్రూరు లో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినం పై గత దశాబ్ద కాలంగా బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు.సమైక్య పాలకుల చేతిలో వివక్షకు గురైందని, తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవం ఎందుకు జరుపరని గత ప్రభుత్వాలను ఎండగట్టిన కేసీఆర్ నేడు అధికారంలోకి వచ్చి పది ఏళ్ళు పూర్తయినా విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించక పోవడం సిగ్గు చేటని,కేవలం ఎంఐఎంకు తలొగ్గి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ ఉత్సవాలు చేయడం లేదని ఎద్దేవా చేశారు.బీజేపి అధికారంలోకి రావడం ఖాయమని, విమోచన ఉత్సవాలను అధికారికంగా అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు,బొమ్మనబోయిన కుమార్, మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్,విజయ్ కుమార్, వినయ్ శర్మ, జలగం రవి, గట్ల భరత్,నూకల నవీన్, సంతోష్,శివ,కొండ యాకన్న, గుండా సురేష్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

పెద్దవంగర మండలం విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు



**శుభ తెలంగాణ :**విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని విశ్వబ్రాహ్మణ సంఘము ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.జయంతి సందర్భంగా విరాట్ పోతునూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.విశ్వబ్రాహ్మణులు తమ యంత్రాలకు పూజలు నిర్వహించి పనులు మరింత వేగవంతంగా జరగాలని తమ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని విశ్వకర్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలం అధ్యక్షులు మల్లికార్జున చారి,గౌరవ అధ్యక్షులు బోగోజు భద్రయ్య చారి, గ్రామ అధ్యక్షులు బోగోజు రత్నవిలాచారి,ముఖ్య అతిథిగా సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మి రామచంద్రయ్య శర్మ,పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ మరియు కాంతా చారి, వేదా చారి,యాకేశ్వరా చారి,సోమన్న,రాంప్రసాద్, నరేంద్ర చారి, తేలుకుంట్ల చిన్న సోమయ్య,సతీష్, యాకయ్య,గోరోజు రాజు,దుర్సోజు రాజశేఖర్, రాజ్ కుమార్, రాజేష్,సాగర్, పత్తిపాక భీష్మాచారి, సోమనర్సయ్య, తేలుకుంట్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు..

## కొయ్యలగూడెం వాసికి జాతీయ బంగారు నంది అవార్డు

● రవీంద్ర భారతి లో అవార్డు అందుకున్న వర్కాల రఘురామ్




**శుభ తెలంగాణ :**యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల్ కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వర్కాల రఘురామ్ జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్-2023 జాతీయ బంగారు నంది అవార్డుకు ఎన్నికయ్యారు. వర్కాల రఘురాం సామాజిక కార్యకర్తగా, కవి, రచయితగా సమాజానికి అందిస్తున్న సేవలను వల్లూరి ఫౌండేషన్ గుర్తించారు. కొయ్యలగూడెం ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా పాఠశాల అభివృద్ధికి రఘురాం ఎనలేని కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన వల్లూరి ఫౌండేషన్ జాతీయ బంగారు నంది అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రాజు, సినిమా కామెడియన్ రఘుబాబుల చేతుల మీదుగా ఆదివారం అవార్డును అందుకున్నారు. ప్రశంస పత్రంను అందజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు.

# తెదేపా మౌన నిరశన






**ఏఎస్ రావు నగర్, సెప్టెంబర్ 17(శుభ తెలంగాణ)** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు ను నిరసిస్తూ తెలుగు తమ్ముళ్ళ మౌన నిరసన కార్యక్రమం మేమంతా మీ వెంటే కార్యక్రమంలో బాగంగా ఏ ఎస్ రావు నగర్ నుండి ఈ సి ఐ ఎల్ చౌరస్తా వరకు మౌన పాదయాత్ర లో నందమూరి సుహాసిని పాల్గొన్నారు.నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిర్భందానికి నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి వినతి పత్రం అందజేశారు.చంద్రబాబు నాయుడు ఐటీ శాఖను దేశంలోనే ముందు స్థానంలో ఉంచారని,ఉద్యోగుల కోసం ఎంతగానో కృషి చేశారన్నారు.రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి దేశంలోనే నెంబర్ వన్ గా చాటి చెప్పిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఆయనను అరెస్ట్ చేయడం దారుణమని ఆమె తెలిపారు.ఇదే సమయంలో మహిళా పోలీసులు లేకుండానే నందమూరి సుహాసినిను అక్కడ నుండి పంపి వేశారు కుషాయిగూడ పోలీసులు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షులు టి జి కె మూర్తి,తెదేపా పార్లమెంటు అధ్యక్షులు అశోక్ కుమార్ గౌడ్,తెదేపా ఉపాధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ రాములు యాదవ్,తెదేపా రాష్ట్ర టి ఎన్ టీ యుసీ ఉపాధ్యక్షులు కనకమేడల రాంబాబు,బి సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్, కార్యదర్శి సూర్ణం రాజేష్,నర్సింహా గౌడ్,రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు,తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు సాయి నాగార్జున,ఉప్పల్ తెలుగు యువత హేమంత్ కుమార్ గౌడ్ నాయకులు నిర్మల సాంబమూర్తి గౌడ్,సావిత్రి,వాసి రెడ్డి లక్ష్మి,విజయ,దుర్గ,తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ రియాజుద్దీన్..



**మేడ్చల్ జిల్లా,సెప్టెంబర్ 17,సెప్టెంబర్ (శుభ తెలంగాణ)**భారతీయ జనతా పార్టీ సిద్ధాంతలకు ఆకార్షితులై గత 15 సంవత్సరాలుగా పార్టీలో పనిచేస్తున్న సయ్యద్ రియాజుద్దీన్ కు మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పాటోళ్ల విక్రమ్ రెడ్డి శనివారం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ రియాజుద్దీన్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా సయ్యద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ నేను గత 15 సంవత్సరాలుగా బీజేపీ పార్టీ లో పనిచేస్తున్నానని పార్టీ సిద్ధాంతలు నచ్చి ఇందులోనే కొనసాగుతున్నని గతంలో బీజేపీ యూత్ లీడర్ గా కూడా పనిచేశానని నా యొక్క పనితనని గుర్తించి నన్ను మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం చాలా ఆనందంగా ఉందని,భారతీయ జనతాపార్టీది సిద్దాంతం, ఆదర్శాలకు పునరంకితమై,నీతి, నిజాయితీ,నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తు,తగిన సమయమిచ్చి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలందరిని సమన్వయం చేస్తూ,కులాలకు ,మతాలకు,అతీతంగా జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు గుర్తించి ఉద్యమాలు చేపట్టి పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచి అన్ని వర్గాలలో పార్టీని మరింత విస్తరించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

## వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి : బండారి లక్ష్మారెడ్డి..



ఉప్పల్ నియోజకవర్గం,సెప్టెంబర్ 17(శుభ తెలంగాణ) ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకుందాం పర్యావరణ పరిరక్షణకు అందరం చర్యలు తీసుకుందాం తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి వినాయకుని ఆశీస్సులతో సకల విఘ్నలు తొలగిపోవాలని అందరికీ శుభం కలగాలని మనసారా కోరుకుంటున్నాను. యువత కూడా నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా కలిసిమెలిసి సోదర భావంతో నిర్వహించుకోవాలని ఆయన తెలియజేశారు. వినాయకుని నిమజ్జనం రోజు చెరువు వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తొందరపడవద్దని ఆయన కోరారు...

# అసంతృప్తులు నెంబరు పెరుగుతోంది సారూ ?



**(శుభ తెలంగాణ)**రాబోయే ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ లో అసంతృప్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. అసంతృప్తులను బుజ్జగించటంలో కేసీయార్, కేటీయార్ ఒకపుడు లైటుగా తీసుకున్నారు. నేతల్లో ఎంత అసంతృప్తున్నా కనీసం పట్టించుకోలేదు. దాంతో మండిపోయిన వాళ్ళల్లో కొందరు పార్టీకి రాజీనామా చేస్తున్నారు. ఇలా రాజీనామాలు చేస్తున్న వాళ్ళంతా కాంగ్రెస్ లో చేరుతుండటంతో తమ గెలుపుపై ప్రభావం చూపుతుందని బీఆర్ఎస్ అభ్యర్థుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. అంతా అయిపోయిన తర్వాత ఇపుడు తీరిగ్గా కేటీయార్ బుజ్జగింపుల పర్వానికి తెరలేపారు. అయినా పెద్దగా వర్కవుటవుతున్నట్లు లేదు. తెలంగాణా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, కేసీయార్ కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన కూచాడి శ్రీహరిరావు నిర్మల టికెట్ ఆశించారు. రాకపోవటంతో పార్టీకి రాజీనామా చేశారు. నకిరేకల్ కు చెందిన మాజీ ఎంఎల్ఏ వేముల వీరేశం కూడా టికెట్ ఆశించి రాకపోవటంతో భంగపడ్డారు.

గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ మందుల సామేల్ తుంగతుర్తి నుండి టికెట్ ఆశిస్తే అది దక్కకపోవటం రాజీనామా చేశారు. ఖానాపూర్ ఎంఎల్ఏ రేఖానాయక్ భర్త శ్యామ్ నాయక్ కూడా రాజీనామా చేసేశారు.

గద్వాల జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ సరిత సైతం ఆశించిన టికెట్ దక్కకపోవటంతో పార్టీకి రాజీనామా చేసేశారు. తాజాగా మానకొండూరు మాజీ ఎంఎల్ఏ ఆరే మోహన్ కూడా నిరాసతో పార్టీకి రాజీనామా చేసేశారు. ఇదే బాటలో తొందరలోనే తుమ్మల నాగేశ్వరరావు, జలగం వెంకటరావు, శాసనమండలి మాజీ డిప్యుటి ఛైర్మన్ నేతి విద్యాసాగర్ రావు, మాజీ ఎంఎల్ఏ నల్లాల ఓదేలు, ఎంఎల్ఏ రేఖానాయక్ లాంటి చాలామంది పార్టీకి రాజీనామాలు చేయబోతున్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికే రాజీనామాలు చేసిన వాళ్ళు కాంగ్రెస్ లో చేరారు. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే నియోజకవర్గాలున్నవి 119 మాత్రమే. అయితే టికెట్లు ఆశించే వాళ్ళు అంతకుమించి ఉన్నారు. అలాంటపుడు ఆశావహులకు కేసీయార్ లేదా కేటీయార్ ఏమని హామీలిచ్చారో తెలీదు. పార్టీలో చేర్చుకునేటపుడు లేదా టికెట్ అడిగినపుడు స్పష్టంగా ఉంటే ఇపుడిన్ని సమస్యలు తలెత్తేవికావు. కానీ నేతలను చేర్చుకునేటపుడు నోటికొచ్చిన హామీలిచ్చేసి చివరకు టికెట్ ఇవ్వకపోతే వాళ్ళు రివర్సవుతారని తెలీదా ? పార్టీకి నష్టమని తెలీదా ? ఇపుడు బీఆర్ఎస్ లో జరుగుతున్నది అదే. చివరకు ఏమి జరుగుతున్నదో చూడాలి.

## ఖమ్మంలో బీఆర్ఎస్ కు కష్టమేనా ?




**(శుభ తెలంగాణ) హైదరాబాద్ :**రాబోయే ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో క్లీన్ స్వీప్ కోసం కాంగ్రెస్ పెద్ద వ్యూహాన్నే అమలుచేస్తోంది. తాజాగా మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావును చేర్చుకున్నది. ఇంతకుముందే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా చేర్చుకున్నది. పొంగులేటి, తుమ్మలకు జిల్లా మొత్తం బలమైన మద్దతుదారులు, అనుచరులున్నారు. పాలేరు నియోజకవర్గంలో టికెట్ ఇవ్వలేదన్న కోపంతో తుమ్మల బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. పాలేరులో టికెట్ హామీ ఇవ్వటంతోనే తుమ్మల పార్టీలో చేరారు అనటంలో సందేహంలేదు.

అలాగే పొంగులేటి ఖమ్మంలో పోటీచేయబోతున్నట్లు సమాచారం. ఇక తేలాల్సింది కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే. నిజానికి తుమ్మల, పొంగులేటి చేరికతో పార్టీ బలోపేతమైనట్లే అనుకోవాలి. ఎందుకంటే ఇద్దరు కూడా ఆర్ధికంగా, రాజకీయంగా చాలా పటిష్టమైన స్థితిలో ఉన్నారు. వీళ్ళిద్దరిని వదులుకోవటం కేసీయార్ తప్పనే చెప్పాలి. టీఆర్ఎస్ పెట్టిన దగ్గర నుండి ఏరోజూ పార్టీ జిల్లాపై ప్రభావం చూపలేదు. ఎంతో కీలకమైన రాబోయే ఎన్నికల్లో మెజారిటి సీట్లు గెలవాలని కేసీయార్ నిర్ణయించుకున్నారు. అలాంటపుడు ఆర్ధికంగా, రాజకీయంగా ఎంతో పటిష్టంగా ఉండే పొంగులేటి, తుమ్మలను వదులుకోవాల్సింది కాదు. వీళ్ళిద్దరిని ఏదో పద్దతిలో పార్టీలో సర్దుబాటు చేసుంటే మెజారిటి సీట్లు బీఆర్ఎస్ కు వచ్చుండేవే. కానీ కేసీయార్ ఆపనిచేయకుండా పోతే పోనీలే అన్నట్లుగా వ్యవహరించారు. దాని ప్రభావం రాబోయే ఎన్నికలపై కచ్చితంగా పడుతుంది. పార్టీలో ఇఫుడున్న ఎంఎల్ఏలంతా ఇతర పార్టీల నుండి ఫిరాయించిన వారే. వీళ్ళెవరికీ సొంత బలంలేదు. సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్యకు కాస్త జనబలముంది. మిగిలిన వాళ్ళంతా ఒకరకంగా గాలివాటం లేదా డమ్మీలనే చెప్పాలి. ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్ గెలవటమే కష్టమంటున్నారు. ఇక్కడ అజయ్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ తరపున పొంగులేటి పోటీచేసే అవకాశముంది. అదే జరిగితే పువ్వాడ ఓటమి తప్పదని బీఆర్ఎస్ లోనే చెప్పుకుంటున్నారు. ఫైనల్ గా తేలాల్సింది కొత్తగూడెం నియోజకవర్గం మాత్రమే. ఇక్కడ జలగం వెంకటరావు ఎందుకనో ఊగుతున్నారు. టికెట్ మీద హామీ దొరికితే జలగం కూడా కాంగ్రెస్ లో చేరుతారేమో తెలీదు.

## హైదరాబాద్ ఈఎస్ఐ ఆస్పత్రి... మైనర్ బాలిక నోట్లో గుడ్డలు కుక్కి...!



**(శుభ తెలంగాణ) హైదరాబాద్ :** అసాంఘిక కార్యకలాపాలకు ఈఎస్ఐ ఆసుపత్రి అడ్డాగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయని చెబుతున సమయంలో... పేషంట్ అటెండర్ లను ఆసుపత్రిలో పనిచేస్తున్న కొంతమంది నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని వరసగా ఆరోపణలు వినిస్తున్న నేపథ్యంలో తాజాగా మరో దారుణం చోటు చేసుకుంది. అవును... హైదరాబాద్ సనత్ నగర్ లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో దారుణం చోటు చేసుకుంది. ఆసుపత్రిలో పని చేసే ఓ యువకుడు ఓ పేషెంట్ సోదరి నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశాడు. దీంతో తేరుకున్న ఆ బాలిక ఆస్పత్రి సిబ్బందికి తెలియజేసింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక కుటుంబం వైద్యం కోసం సనత్ నగర్ లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. సుమారు వారం రోజుల నుండి ఈ ఆసుపత్రిలో బాధిత బాలిక (13) అన్నయ్య చికిత్స తీసుకుంటున్నాడు. ఈ సమయంలో అన్నయ్యకు తోడుగా ఉంటున్న ఆ బాలికపై ఆ ఆస్పత్రిలో లిఫ్ట్ ఆపరేటర్ గా పని చేస్తున్న ఓ యువకుడు కన్నేశాడు. ఈ క్రమంలో... గతరాత్రి బాలిక లిఫ్ట్ లో వెళ్తున్న సమయలో ఆమెను అడ్డుకున్నాడు. ఆ తర్వాత లిఫ్ట్ ని పై అంతస్తుకు తీసుకెళ్ళాడు. ఆపై ఆమె నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశాడు. దీంతో అక్కడనుంచి తప్పించుకున్న బాధిత బాలిక తనపై జరిగిన దారుణాన్ని ఆస్పత్రి సిబ్బందికి చెప్పింది. దీంతో ఆమెకు వైద్యపరీక్షలు చేసిన అనంతరం... ఆమె అత్యాచారానికి గురైందని రిపోర్ట్ ఇచ్చారు. అనంతరం బాధిత బాలిక ఎస్ ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదే సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇలాంటి వారిపై ఆస్పత్రి యాజమాన్యం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

Edited, Printed, Published & Owned by Sri ChandraShekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandraShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com